


[5–10–47 సంచిక నుండి

## ౨౦

"భోజనా లయేటప్పటికి రెండింటికంట కావచ్చింది. పొద్దుటిగూట అంతా అదే పనిగా తిరిగిన శ్రమకి భుక్తాయాసం తోడుపడింది; కాని నేనదేమీ లక్ష్యపెట్టలేదు. చెయ్యి కడుక్కోడం తడవుగా, మనస్సు బజారుకి పరుగులు తీసింది. బేరాలు మించిపోతున్న ట్లుందో లేదా, లాభం మరొకడికో కొట్టుకుపోతున్నట్టు కంగారూ నన్ను ఉద్రిక్తుణ్ణి చేశాయి. మళ్ళీ బజారులో పడ్డాను. ఎక్కాయోకాని అక్కణ్ణుంచి పేటలో వురిక్కాను."

"రెండయింది. రెండున్నర అయింది. మూడు న్నూ అయింది; కాని బేరం తగలలేదు. మూడ మని దేవ్వరికి నా పనుకు చూసేవాళ్ళు కనపడ లేదు. విసిగిపోయాను. "ఇక బేరం వదులుకోవాలా?" అనిపించింది. అయినా, పోకుండా తిరిగిన వీధే తిరిగాను. ఒకటి రెండుసార్లు "తువ్వాళ్ళు—అంగాస్త్రాలు" అని కేకలు కూడా పెట్టాను. అది విని వో యింటావిడ, భాగ్యదేవం తెరతొలగి వచ్చినట్టు వొయ్యారంగా వచ్చింది. "తువ్వాళ్ళేం గాని అంగాస్త్రాలు చూపించు" అంటూ కళ్ళు తిప్పుతుంది. తిప్పుతుంటూనే తిరగటిరాయి లాగ అరుగుమీద చతికిలబడింది."

"వెళ్ళి ఉన్నవన్నీ ముందు పడేశాను. ఆవిడ, బట్ట మైలపడిపోతుందేమో అన్నట్టు కొంచెం దూరంగా జరిగి కొంతసేపు మడతలన్నీ పరకాయించింది. తరవాత, యేమయితేకానీ అని తెగించినట్టు ముట్టుకుని, ప్రతిది కిందా మీదా వేసూ రెండేసి నిమిషాలు తిప్పితిప్పి చూసింది. చివరికి "తువ్వాలు కొనడమా, అంగ్రస్త్రం కొనడమా?" అన్న జిజ్ఞాసలో పడింది."

"అది వో పట్టాన తెముల్చుకోలేకపోయింది. "అంగాస్త్రం పొడుగ్గానేవుంది, వెడల్పు చాలదు. తువ్వాలు వెడల్పుగానే వుంది, పొడుగు చాలదు" ఇదీ ఆవిడ బాధ. తువ్వాలు చేతపుచ్చుకోడం. మడత విప్పి తిరగేసీ మరగేసీ చూసి నామీద పడెయ్యడం. అంగాస్త్రం పుచ్చుకోడం. అదిన్నీ చూసిచూసి విసిరికొట్టడం. "అబ్బే, వొద్దోయ్! నిన్నాపుచేశావా కొం? ఏం చెయ్యనూ? వెళ్ళిపో" అనడం, ఆ మాటమీదా నిలవక "పోనీ, నీకేది యివ్వాలని వుంటే అది యిచ్చేసి వెళ్ళిపో" అనడం, "నీమూలాన నాకు మతిపోతోందోయ్" అంటూ లేచినట్టే లేచి మళ్ళీ చతికిలబడడం. వీధిపోయే అమ్మలక్కలను నిలేసి, నా సంగతి విడచిపెట్టి, ఏమిటేమిటో కబుర్లు విడెయ్యడం."

"చూశాను, చూశాను, విసుగు పట్టలేక "ఛీ! ఇలాంటి బేరాలు తిరిగితే కొంపు చేరులా తిరాలి బుర్ర" అన్నాను కసురుకు పోగుచేసుకుంటూ. దీనిమీద ఆవిడ వ్యగ్రమయింది. "ఏం అబ్బీ! నేను కొనుక్కో వనుకున్నావా, కొనుక్కోలే ననుకున్నావా! లింగూ లింగూ నాలుగు తువ్వాళ్ళూ, నాలుగు అంగాస్త్రాలు వేసుకువచ్చావు, లక్షలమీద వర్తకం చేసేవాడిలాగ మాట్లాడుతున్నావు మహా. చాల్లే, నెప్పుచెప్పకపోయావ్. లాభం పట్టుకుపోడానికి వచ్చినవాడికి ఇంత యెగిసిపాటు లేనూ, ఇంత ముక్కున మసిపూసుకు తసేనూ యెలాగా?" అని మండిపడుతూ, వొక తువ్వాలూ, వొక అంగాస్త్రమూ పుచ్చుకుని, బొడ్డుకొంగు విప్పి మూడు పావలాలు నామీద విసిరికొట్టి "మరి దయచెయ్యి, అవతల బేరాలు మించిపోతున్నాయి కామోసు" అని తిప్పుకుంటూ యింట్లో కుడాయించింది."

"నాకు వల్లమాలిన కోపమూ వచ్చింది, అంతకంటే యెక్కువగా నవ్వూ వచ్చింది; కాని కొంపు మూటలు విడుదల కావడం, మూడు పావలాలు చేతిలో పడడం-దీంతో, అవి రెండూ పోయి ఆనందం అంకురించింది."




[ప్రచురితమగుతున్న కొత్త సీరియల్]

"ఇంతే కాదు, వీనివల్ల నాకింకో మేలున్నూ సిద్ధించింది. అది "వర్తకం చేసేవాడు, విసుగు కనపడనివ్వకూడ" దన్న జ్ఞానం. ఎంతో కొంత లాభం వేసుకోకుండా ఏ వర్తకుడూ సరుకివ్వడు. అయితే, కొనుక్కునేవాడు అమ్మేవాడి దగ్గిర తనే మహా తెలివైనవాడైనట్టు దర్జా వెలిగిస్తాడు. తన ఆత్మగౌరవం భంగపడకుండా వర్తకుడు దాని కభ్యంతరం చెప్పకూడదు. పైగా, కొనుక్కునేవాడు మంచిసరుకు దొరికిందని తృప్తిపడాలి. "నేను కనక, ఇంత తక్కువ ధరకు కొనగలిగాను" అని పొంగిపోవాలి. వర్తకుడు, దద్దమ్మ అని—అథవా, అమాయకుడని జాలిపడాలి. నిజాని కిద్దరికీ కూడా యెవరి అవసరాలు వారికుంటాయి; కాని తామీ సరుకు కొనడం, వర్తకుణ్ణి ఉద్ధరించడమే అని కొనుక్కునేవాళ్ళలో కొందరి నమ్మకం. మరోపని చేతకాక, వర్తకులు, బజారులో కూచుంటారని జాలిపడేవారి నెందరినో చూశాను నేను, కొనుక్కునే వాళ్ళలో."

"మళ్ళీ నాలుగు వీధులు తిరిగితే గాని "ఏదీ చూపించు" అన్నమాట లేకపోయూరు. అప్పుడైనా మంచి బేరం తగిలితే బాగుండిపోను. వొక వింతమనిషి తగులుకున్నాడు. అప్పటికి యాభయ్యోపడి నడుస్తోం దాయనికి. మనిషి చూస్తే దబ్బపండు వన్నెలో కళగానే వున్నాడు; కాని జంతువు. ఆయనతో అవసరపడి అంతలికి వెళ్ళేదాకా మాత్రం నాకా సంగతి తెలియలేదు."

"జరిగిం దేమిటంటే? ప్రతీ అంగవస్త్రమూ మూరవేశాడాయన. ప్రతీ తువ్వాలూ వొంటికి చుట్టుకుని చూసుకున్నాడు. ఒక తువ్వాలు విప్పి, మధ్యకి మడిచి, భుజాన వేసుకుని చేతులు వెనక్కి విరిచి పట్టుకుని, భుజం యెగరవేసుకుంటూ ఇటూ యిటూ పచార్లు చేశాడు. తిరిగితిరిగి వొక కుర్చీ మీద అది పరిచి దానిమీద కూచున్నాడు, హఠాత్తుగా జ్ఞాపకం వచ్చినట్టు ఉబ్బెత్తుగా లేచి, గబగబా వెళ్ళి, నాంతో మేజామీది దుమ్ము దులిపాడు. చరచరా లోపలికి వెళ్ళి చేతులు కడుక్కుని దానితోనే తుడుచుకున్నాడు. మూతి కూడా తుడుచుకుంటూ వచ్చాడు. చివరికి "నీకు అమ్మాలని వుంటే బేరం లేకుండా వొక్కటే ధర చెప్పు. లేదూ, పట్టుకుపో" అంటూ నామీద పడేశాడు."

"నా—కు కోపం వచ్చింది. పంగులూ వొళ్ళు మండుకుపోయిందంటే నమ్ము. "ఏమిటీ తగవు?" అన్నడిగాను. "అంత గతి లేకపోతే భార్యామణి పాతచోక చీరలు వాడుకోరాదూ?" అన్నబోయాను; గాని పట్టాయించి "యెప్పుడైనా దయిగా కొని యెరుగుదువా?" అని నిలదీశాను. "మీదే స్వామ్మ? అరసంగా లచ్చి యిలా తిట్టుకుని యేమాత్రం గడించావయ్యా?" అంటూ దులిపేశాను."

"దీనిమీద చాలా కోపం వచ్చింది ఆయనకి; కాని గొణుక్కోడమే గాని మాట స్పష్టంగా పైకి రానియ్యడు. అది చూసి 'యేదో పనుండి యీ మేడిపండుకి' అనుకున్నాను. ఇంతలో, లోపల్నుంచి నలభైయేళ్ళ వొకావిడ వచ్చింది. వెంటనే బల్లి అయిపోయాడు మానవుడు. అందుకే నే నాశ్చర్యపడుతూ వుండగా "ఈ జన్మలో యిక యింతే. ఇంటోకి దయచెయ్యండి" అని తగుస్థాయిలో వురిమిం దావిడ. పిల్లి అయి, మాయంకూడా అయిపోయా డాయన."

"అప్పుడు చూసింది నాకేసి ఆవిడ."

"నేను జరిగిందంతా చెప్పాను."

"ఈ వీధికి నువ్వు కొత్తవాడవా? ఇంకెప్పుడూ ఆయనతో మాట్లాడకు. పిలిచినా పలక్కు.

* ఆనందవాణి

ముందు నీ కెంత యివ్వాలో చెప్పు" అందావిడ. నేను చెప్పాను. ఆవిడ యిచ్చివేసింది."

"పంతులూ! ఐశ్వర్యవంతుల బిడ్డల్లో యెలాంటి మహానుభావు లున్నారో యెప్పుడయినా చూశావా? నిజంగా, బ్రహ్మదేవుడి సృష్టిచాతుర్యం చూడవలసింది వాళ్ళదగ్గిర బీదవాళ్ల దగ్గిర కాదు."

౨౧

"ఇలాంటి వేగాలతో యెంత చిరాకు పుట్టినా, అంతసేపూ నోపిపట్టి తిరిగి, యెలా గయితేం సరుకు విడుదల చేసుకున్నాను. అప్పటికి పొద్దు దూకుతోంది. అంగడి తెరుచుకూర్చున్న వాళ్ళు కదిలే సమయం; కాని నా కేమి లాభమూ? అయితే, అమ్మినకాడికి దక్కినమాత్రం చేరిందో చూసుకోవాలని నాకు మళ్లీ వుబలాటం పుట్టింది. సంచి పైకి తీద్దామని జేబులో చెయ్యిపెట్టాను; కాని నా ప్రజ్ఞ ముందు మా అమ్మకి చూపించాలని ఆత్రం పుట్టింది. ఎన్ని విధాల ప్రయత్నించినా మనసు లొంగలేదు. కాళ్లలో, వొణుకు లాంటిది కూడా పుట్టింది. గబగబా యింటికి బయలుదేరాను."

"మధ్యాహ్నం నే నింటికి చేరుకోకపోవడం వల్ల నాకోసం యెదురుతెన్నులు చూస్తూ వుండిన మా అమ్మ, నేను గుమ్మంలో అడుగుపెట్టాటప్పటికే "మధ్యాహ్నం బువ్వ తిన్నావా నాయనా?" అంటూ నన్ను పొదువుకుంది. "తిన్నా" నంటే సరిపోయేది; కాని నా వుత్సాహంలో ఆ మాట తోచలేదు. పైగా "చెలుతా రా" అంటూ విడిపించుకుని దీపందగ్గిరికి వెళ్ళిపోయాను. ఇది మా అమ్మకి ఆదుర్దా పుట్టించింది. వెంటనే మళ్లీ ఆ మాటే అడుగుతూ లోపలికి వచ్చింది. అప్పటికప్పుడే నేను సంచి గుమ్మరించి ఒక రూపాయి చిల్లర వేరే వుంచి తక్కింది లెక్కబెడుతున్నాను, మా అమ్మ వెంగం చూశాటప్పటికి నాకు లెక్క మరుపువచ్చింది. "తిన్నా నమ్మా" అన్నమాట అప్రయత్నంగా వుచ్చరించి అప్పుడు లెక్క పూర్తిచేశాను. డబ్బంతా కుంకంగుట్టలుగా వుండడం చూసి, వొకటి అపలనీ, రెండోది లాభం అనీ, గుర్తించి మా అమ్మ పొంగిపోయింది. ఆవిడ


కుష్టు ★ బొల్లి

అన్నిరకముల కుష్ఠులకు, బొల్లి వ్యాధులకు, ఇతర చర్మవ్యాధులకు గ్యారంటీగా పనిచేయుచున్నవి.

మా ఔషధ రాజములే!!

క్రొత్తగా అచ్చువేయబడిన మా తెలుగు పెద్ద కేటలాగులు, 10 భాషలలో ముద్రించియున్న కేటలాగులు, ఆరోగ్యశాస్త్రములు ఉచితము!

రెడ్డి & కో., (రిజిస్టర్డు) ★ H. O. గోపాలపురం (వయా) తణుకు, తూ. (గోదావరిజిల్లా)

బ్రాంచ్ ఆఫీసులు:

బెజవాడ గాంధీనగరం ★ వాల్తేరు R. S ★ కటక్ బక్సిబజార్ ★ సికిందరాబాదు 8560 కింగ్సువే

నెల్లూరు కాపువీధి ★ ఫజిల్‌నగర్ గోరక్‌పూర్

ఆనందం చూశాటప్పటికి నాకు వొళ్లే తెలియలేదు."

"ఏం తప్పా? రూపాయికి రూపాయి తొమ్మిది దశాల లాభం చూసుకుని అనుభవిస్తున్న ఆనందం అది. నా జీవితంలో—కళ్లు తెరవని బాల్యంలో—"హరిః ఓ"మ్మని సంసారబాధ్యత మీదపడ్డనాడు వచ్చిందది. దాని విశిష్టత నువ్వు గుర్తించగలవా? ఒక్క సంవత్సరంలో గవర్నరుకి వచ్చే జీతానికయినా అంత విలువ వుంటుందా! దాంతో నాకు కలిగిన ధైర్యోత్సాహాలకు పరిమితి కట్టగలవా నువ్వు! ఆ సన్నివేశం తలుచుకుంటే నాకిప్పటికీ—హాయి హాయి! ఏమి ఆనంద మోయ్! ఇలాంటి ఆనందం అనుభవించని బతు కేం బతుకోయ్?"

"ఏం, కష్టంగా వుందా నాయనా, నీకు? అవునులే, తరవాతి సంగతి విను. అప్పుడు మా అమ్మ మొహాన మెరిసిన 'ఆనందం' దివ్యజ్యోతి అయి నా భవిష్యజ్జీవితం అంతా ప్రకాశమానమై వుండేటట్టు కనపరిచింది. "నాయనా! చదువు సాగకపోతే సాగకపోయింది, యీశ్వరు డిలాగయినా నీకింత అన్నం పెడితే చాలు. నీవు నువ్వయినా వొక యింటివాడవైతే, నాకదే పదివేలు. సరదాకు గాని సుఖము నీకేమీ చేర్పలేకపోయాం. నీ కొక్కలు ఒళ్లగా వుంది, నాలుగు రాళ్లు సంపాదించుకుంటేనా సంఘంలోనూ తల యెత్తుకుని బతకవచ్చు" అంటూ మా అమ్మ నన్ను మళ్లీ పొదువుకుంది మూర్ధాఘ్రాణం చేస్తూ."

"అదిగో, నువ్వు నవ్వుతుంటున్నావు, ఇదంతా నీకు హాస్యాస్పదంగా కనబడతోంది, కదూ? అవునోయ్! నేటి నాకా బ్రాహ్మణజాతిని ఆవరించుకుని వుండిన పరిసరా లలాంటివి. వాటికి బయటి ప్రపంచం యెలా వుందో గుర్తించుకోవాలంటే, గతానికి గర్వించగలగడం కాదు, భవిష్యత్తు రూపించుకోగలగాలి. నాకు తెలుసు నాయనా, బ్రాహ్మణవర్గం యెంత పాడయిపోయిందో నే నెరుగుదును. యజనయాజనాధ్యయనాధ్యాపనదాన ప్రతిగ్రహషట్కర్మనిరతమైన బ్రాహ్మణవర్గానికి, తాలూకాకచ్చేరీలో అటెండరుపనీ, పోలీసుసేవనులో కానిస్టేబులు పనీ, సివిలు కోర్టుల్లో దలాయతుపనీ—ఇంకా యిలాంటివీ, ఉద్యోగాలయి నోరూరిస్తున్నపుడు, దానిమీద యితర్లు రాళ్ళు రువ్వారంటే తప్పా?"

[ఇంకా వుంది]

# కలంతాజా

బి. జగ్గారావు

స్థానబలం: ఇది ఆంధ్రులకు పూజ్యం!

పశువు (గోవు): దీనిని హిందువులు పూజిస్తారు. మరి పశుత్వాన్ని?..........

కుహనప్రేమ: మనిషికి మనసుంటే—ఆ మనసున విషముంటే—బ్రతుకునకు మైపూతే ఆ ప్రేమ!

రేపు: ఇదొక ఆకాశం, దీన్ని చేరలేం! ఎన్ని సంవత్సరాలు జీవయాత్ర చేసినా మనకి—దీనికి మధ్య 24 గం॥లదూరం తప్పదు. ఈ రేపుకు వాయిదావేసిన ఆశలు-ఆలోచనలు ఆకాశంలోని నక్షత్రాల్లాంటివి!

మా వులు చేసిన దేవుళ్ళు—
వరా లియ్యలేరు!
శిల్పి వ్రాసిన దీపాలు—
కాంతు లియ్యలేవు!

కామ—క్రోధ—లోభ—మోహ—మద-మత్సరాలు—ఇవి నదులు. ఈ ఆరు నదుల కలయికయే జీవిత సాగరం.

# ఎంత చిత్రమో!

దక్షిణ ఆస్ట్రేలియాలో ఒక అనాథ శరణాలయమున్నది. అందులో వుంటున్న ఇద్దరు కవలలు ఎనిమిదో యేటనే అక్కణ్ణించి విడిపోయారు. విడిపోయి యాదాలాపంగా మళ్ళీ ముప్ఫయివత్సరాల తరువాత కలుసుకున్నారు. ఆ కలుసుకున్నప్పటికి ఒకరినొకరు పూర్తిగా మరిచేపోయ్యారు, ముప్ఫయేళ్ళ తరవాత కలుసుకున్న సమయానికి-వారుభయులూ ఒకే మోస్తరు వస్తు మెషీన్‌టీల్లో వున్నారు. ఇద్దరూ ఒకేరకం పొగాకు కాలుస్తున్నారు. కొలిచిచూడగా ఇరువురూ ఒకే ఎత్తు. ఉభయుల్నీ పోల్చిచూస్తే తినే పదార్థాలపైన ఇష్టానిష్టాలు ఇద్దరకూ ఒక్కటేమోస్తరు. ఏమీ వ్యత్యాసంలేదు. ఇద్దరకూ గుర్రపుస్వారీ అంటే మక్కువ. ఇద్దరూ పానీయాలు స్వీకరించి, దిట్టంగా పొగ పీలుస్తారు. ఇద్దరకూ కూడా ఎన్నడూ తగినంతగా కుస్తీ చేసివుండలేదు. ఇరువురకూ సరిగ్గా అవే పళ్ళు ఊడిపోయినాయి.